



• మాధవగనర్ శివారులోని ఆర్‌యూబీ కింద నిలిచిన నీరు

నత్తనడకన మాధవనగర్ ఆర్వోబీ పనులు

- రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద నిలిచిన మురుగు నీరు
- వాహనాల రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- బైపాస్‌లో సెంట్రల్ లైటింగ్ లేక రాత్రి వేళ ప్రమాదాలు
- పనులు వేగవంతం చేయాలని కోరుతున్న ప్రయాణికులు



• మాధవనగర్ శివారులో రైల్వే ఓవర్ బ్రిడ్జి వంతెన పనులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై మాధవనగర్ శివారులో రైల్వే వంతెన పనులు గత ఏడాది ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో పనులు వేగవంతంగానే జరిగినా.. మధ్యలో వేగం తగ్గించారు. జనవరి 9 నుంచి పూర్తి స్థాయిలో ఈ రైల్వే గేటును మూసివేశారు. వాహనదారులు ప్రత్యామ్నాయంగా బైపాస్ రోడ్డు కంఠేశ్వర్ మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా మారింది. కంఠేశ్వర్ చౌరస్తాకు దగ్గరలో పూలంగ్ వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు నెమ్మదిగా జరగడంతో ఒకే వైపు వంతెనపై నుంచి వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. ఇక్కడికి రాగానే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇక మరో ప్రత్యామ్నాయం మాధవనగర్ శివారులో గల ఆర్‌యూబీ(రైల్వే అండర్ బ్రిడ్జి), ఇక్కడ కలుషిత నీరు నిలకడగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే నీటిని తొలిగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

భారీ వాహనాలను నియంత్రించాలి

మాధవనగర్ శివారులో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నుంచి భారీ వాహనాలు వెళ్లడానికి వాహనదారులు పోటీపడుతున్నారు. ఇక్కడ ఉన్న ఆర్‌యూబీ నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా బైపాస్ రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. కేవలం ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలను మాత్రమే అనుమతిస్తే వాహనదారులకు సులభంగా ఉంటుందని భావిస్తున్నారు.

బైపాస్ పై సెంట్రల్ లైటింగ్ లేక ప్రమాదాలు

రైల్వే గేటు పూర్తి స్థాయిలో మూసివేయడంతో వాహనాలు పూర్తిగా బైపాస్ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. బైపాస్ రోడ్డులో డివైడర్ నిర్మాణం లేక సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులు రైల్వే వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.





విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

మూడో సారి మోదీయే ప్రధాని


• ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 11: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీదే విజయమని, మూడో సారి కూడా మోదీ ప్రధాని కానున్నారని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం నగరంలోని ఖిల్లా రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు అంతకు ముందు శివాజీనగర్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం మొత్తం మోదీ మానియా నడుస్తుందని, 500ఏళ్ల కలగా ఉన్న అయోధ్య రామమందిరం నిర్మాణంతో దేశం మొత్తం మోదీ వైపు చూస్తుందన్నారు. నిజామాబాద్ పార్లమెంటు ఎన్నికల్లోనూ మరోసారి బీజేపీ గెలుస్తుందని నిజామాబాద్‌లో బీజేపీ గెలుపు మోదీకి బహుమతిగా ఇస్తామన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని ఈ రోజు నుంచి ప్రారంభిస్తున్నామని గ్రామ గ్రామానా తిరుగుతూ బీజేపీని విస్తరిస్తామన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.

మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటే ఎమ్మెల్యేలుగా గెలిచే అవకాశం

నగరంలో మున్నూరుకాపులు అనేక మంది కార్పొరేటర్లుగా ఉన్నారని, ఐక్యంగా ఉంటే ఎమ్మెల్యేలుగా గెలిచే అవకాశం ఉంటుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన దినేష్‌కులాచారికి మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమం ఆదివారం నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అర్వింద్ మాట్లాడుతూ.. అసలైన కాపు బిడ్డ నరేంద్రమోదీ అని కేంద్ర ప్రభుత్వం కల్పు మొక్కలను ఏరివేస్తూ ఒక్క పైసా అవినీతిలేని పాలన అందిస్తుందన్నారు. గత ఐదేళ్లలో ఎంపీగా నిజామాబాద్‌లో పైసా అవినీతి లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో పసుపు ధర 20వేల వరకు పలుకబోతుందని, వరికి, చక్కెరకు మద్దతు ధర పెంచనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు ధర్మపురి సురేందర్, న్యాలంరాజు, ప్రవళికశ్రీధర్, బంటువైష్ణవిరాము, పంచరెడ్డిలావణ్యలింగం, సంతోష్, హరిదాస్, సాయిరెడ్డి, శెట్టిరాజు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.





ప్రాణహిత-చేవెళ్లపై రైతుల ఆశలు

- పదిహేనేళ్ల క్రితం ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులు ప్రారభం
- ఏళ్లతరడబడి నత్తనడకన కొనసాగుతున్న ప్యాకేజీ పనులు
- ఒక్క ఎకరానికి కూడా అందని సాగునీరు
- కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఉమ్మడి జిల్లా రైతుల ఆశలు

నిజామాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా మెట్టప్రాంతాలకు సాగునీరందించే ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులపై మళ్లీ రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో మొదలు పెట్టిన ఈ ప్యాకేజీల నిర్మాణాలు మళ్లీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో త్వరగా పనులు పూర్తవుతాయని రైతులు భావిస్తున్నారు. పదిహేనేళ్ల క్రితం మొదలుపెట్టిన ఈ ప్యాకేజీల పనులు ఇప్పటి వరకు పూర్తికాకపోవడం, రీ డిజైనింగ్ పేరిట ఏళ్ల తరబడి సాగుతూనడవడం వల్ల ఇప్పటికీ ఎక్కడా ఎకరానికి కూడా సాగునీరు అందలేదు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో చేపట్టిన ఈ ప్యాకేజీల పనులు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళేశ్వరం పథకంలో కలిపినా ఊపందుకోలేదు. నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడం, రీ డిజైన్ పేరిట మార్పులు చేయడం, కాల్వలకు బదులు పైప్‌లైన్‌ల ద్వారా సాగునీ రందించేందుకు నిర్ణయించడం వల్ల ఆలస్యమైంది. గడిచిన మూడేళ్ల క్రితమే పంప్‌హౌజ్‌ల నిర్మాణం పూర్తయినా మోటార్లను సకాలంలో బిగించకపోవడం వల్ల కొంతమేర ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉన్నా పనులు ఆలస్యం వల్ల ఇప్పటి వరకు మొదలుపెట్టలేదు.

పదిహేనేళ్ల క్రితం శంకుస్థాపన


ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌పై ఆధారపడి ప్రాణహిత చేవెళ్ల పథకం కింద 20, 21, 22 ప్యాకేజీ పనులకు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పదిహేనేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. ఎస్సారెస్పీ నుంచి బ్యాక్ వాటర్ ద్వారా నీటిని తీసుకుని ఉమ్మడి జిల్లా పరిధిలోని నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల పరిధిలోని మెట్ట ప్రాంతాల్లో 4లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు ఈ ప్యాకేజీలను డిజైన్ చేశారు. వర్షాలు పడే సమయంలో ఎక్కువ మొత్తంలో నీటిని తీసుకునే విధంగా నిర్ణయించారు. ఈ ప్యాకేజీ భాగంగా నవీపేట మండలం బినోల నుంచి నిజామాబాద్ మండలం సారంగపూర్ వరకు 20వ ప్యాకేజీ కింద సొరంగమార్గం ద్వారా నీటిని తరలించేందుకు అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. వారి హయాంలోనే సొరంగం పనులను పూర్తిచేశారు. సారంగపూర్ వద్ద పంప్‌హౌజ్ నిర్మాణం చేపట్టి 21వ ప్యాకేజీ కింద జిల్లాలో నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్, జగిత్యాల జిల్లాలోని మెట్‌పెల్లి, ఇతర మండలాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు నిర్ణయించారు. సారంగపూర్ పంప్‌హౌజ్ ద్వారా నీటిని ఎత్తి నిజాంసాగర్ కాల్వలో వేసి ఆ నీటిని మెంట్రాజ్‌పల్లి వరకు తరలిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన పంప్‌ల ద్వారా ఈ నియోజకవర్గాల ఎరిధిలోని ఆయకట్టుకు సాగునీరును అందించేందుకు నిర్ణయించారు. సారంగపూర్ నుంచే నిజాంసాగర్ కాల్వలో నీటిని ఎత్తి సొరంగమార్గం ద్వారా మాసాని చెరువుకు నీటిని తరలించనున్నారు. అక్కడి నుంచి కొండెం, మంచిప్ప రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. అక్కడి నుంచి గడ్కోల్ పంపు ద్వారా సిరికొండ వరకు నీటిని అందించేందుకు డిజైన్ చేశారు. మంచిప్ప రిజర్వాయర్ నుంచి 22వ ప్యాకేజీ ద్వారా ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరందించే విధంగా ఉమ్మడి రాష్ట్ర హయాంలో డిజైన్ చేసి పనులను మొదలు పెట్టారు. ఆ సమయంలో 2200 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనావేశారు.

ప్రత్యేక రాష్ట్రంలో రీ డిజైన్

ఉమ్మడి రాష్ట్రం పోయి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులను రీ డిజైన్ చేశారు. ఈ ప్యాకేజీలను కాళేశ్వరం పథకంలో కలిపారు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో డిజైన్ చేసిన విధంగా కాల్వల ద్వారా సాగుకు నీటిని అందించ కుండా మొదటిసారిగా పైప్‌లైన్‌ల ద్వారా అందించేందుకు నిర్ణయించారు. నిర్మాణ వ్యయాన్ని పెంచి పనులను చేపట్టారు.

సాగునీరు అందించేందుకు మంచిప్ప ఎత్తు పెంపు

ఉమ్మడి జిల్లా పరిధిలో సాగునీరు అందించేందుకు మంచిప్ప రిజర్వాయర్ ఎత్తు పెంచుతున్నట్లు ప్రకటించారు. రిజర్వాయర్ కెపాసిటీని 3.5టీఎంసీకి పెంచారు. మంచిప్ప ఎత్తు పెరగడం వల్ల ఆ గ్రామంతో పాటు తొమ్మిది గ్రామాలు ముంపునకు గురవడం, సుమారు 2600ఎకరాల వరకు మునిగిపోతుండడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు అందోళనలకు దిగారు. భూసేకరణకు ఒప్పుకోకపోవడం వల్ల ఇప్పటి వరకు చేపట్టలేదు. మంచిప్ప రిజర్వాయర్ పనులను కొనసాగించలేదు. రీ డిజైన్ తర్వాత జిల్లా పరిధిలో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సారంగపూర్, మెంట్రాజ్‌పల్లి వద్ద పంప్‌ల నిర్మాణం చేసినా ఇప్పటి వరకు మాత్రం నీటిని అందించలేదు. మంచిప్ప రిజర్వాయర్ పనులు గ్రామస్థులు అడ్డుకోవడంతో గడ్కోల్ పంప్ నిర్మాణం పనులు మాత్రం కొంతమేర చేశారు. ప్యాకేజీ 22 కింద కామారెడ్డి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు పనులను చేపట్టలేదు. మంచిప్ప రిజర్వాయర్ నుంచే ఈ నీటిని తరలించాల్సి ఉండడంతో పనులు కొనసాగకపోవడం వల్ల పదిహేనేళ్లయినా ఈ ప్యాకేజీ పనులు ఇప్పటికీ 30శాతం కూడా కాలేదు. కాగా, ఉమ్మడి రాష్ట్ర హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే ఈ ప్యాకేజీ పనులు చేపట్టడం వల్ల ప్రస్తుతం అదే ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడడం వల్ల ఈ దఫా పూర్తవుతాయని ఉమ్మడి జిల్లా రైతులు భావిస్తున్నారు. ఈ ప్యాకేజీల కోసం అప్పుడు భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న పి.సుదర్శన్ రెడ్డి ఎక్కువగా దృష్టిపెట్టడంతో పనులు జరిగాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో నత్తనడకన కొనసాగాయి. బోధన్ నుంచి మళ్లీ ఆయనే ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఆశలు పెరిగాయి. ప్రభుత్వంలో ఆయన కీలక పొజిషన్‌లో త్వరలో ఉండనుండడంతో ఆయన ఆధ్వర్యంలోనే మళ్లీ పనులు వేగంగా జరిగే అవకాశం ఉన్నాయని భావిస్తున్నారు. రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీల పనులకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో 28వేల కోట్ల రూపాయలు ఇరిగేషన్ కోసం కేటాయించారు. కామారెడ్డి జిల్లా నుంచి ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ కూడా నియామకం కావడం వల్ల ఈ పనులకు నిధులు రావడంతో పాటు త్వరగా జరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.



జిల్లాలో భారీగా ఎంపీడీవోల బదిలీలు

నిజామాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పనిచేస్తున్న ఎంపీడీవోలను బదిలీ చేసింది. వారిని వెంటనే బదిలీ అయిన స్థానాల్లో చేరాలని ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఎంపీడీవోలను జిల్లాలో నియమించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా పరిధిలో పని చేస్తున్న ఎంపీడీవోలను బదిలీ చేశారు. ఈ మేరకు పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో పనిచేస్తున్న 20 మంది ఎంపీడీవోలను కామారెడ్డి, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాలకు బదిలీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న టీవీఎస్ గోపిబాబు, ఎం.సంతోష్ కుమార్, రాజేశ్వరి, బీఎస్ లీలావతి, ఎ.నాగవర్ధన్, సయ్యద్ సాజీద్ అలీ, వి.కమలాకర్, ఎం.డి. బషీరుద్దీన్, కె.రాజేశం, టి.సంతోష్‌రెడ్డి, పి.భారతి, బి.శ్రీనివాస్, టి.పర్బన్నలను కామారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. బి.రాములు నిర్మల్, ఎం.దామోదర్‌ను మెదక్‌కు, జి.బాలగంగాధర్‌ను, కె.లక్ష్మణ్‌ను కె.రాజ్ వీర్‌ను ఆదిలాబాద్‌కు, పి.శ్రీనివాస్‌రెడ్డిని, వి.శంకర్‌ను సంగారెడ్డికి బదిలీ చేశారు. జిల్లాకు ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఎంపీడీవోలను నియమించారు. కామారెడ్డిలో పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్, ఎ.బాలకృష్ణ, ఎ.అనంతరావు, ఎం.సతీష్‌కుమార్, ఎన్.శంకర్, వి.బాలకిషన్‌ను జిల్లాకు బదిలీ చేశారు. మెదక్‌లో పనిచేస్తున్న కె.ప్రవీణ్‌ను జిల్లాకు బదిలీ చేశారు. నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న బి.శ్రీనివాస్‌రావు, ఎం.వెంకటేశ్వర్లు, ఎ.నాగ్‌నాథ్, పి.సాయిరాం, వి.వనజా, కె.సరోజ, టి.సురేష్‌బాబు, కె.విజయ భాస్కర్‌రెడ్డిలను జిల్లాకు బదిలీ చేశారు. సంగారెడ్డిలో పనిచేస్తున్న ఎ.రవీందర్, ఎం.డి. ముజఫరుద్దీన్ జిల్లాకు బదిలీ చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో దీర్ఘకా లికంగా పనిచేస్తున్న ఈ ఎంపీడీవోలను బదిలీ చేశారు. కొంత మంది పక్క జిల్లాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వగా మరికొంత మందికి ఇతర జిల్లాలకు కేటాయిం చారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పని చేయాలి'



డొంకేశ్వర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

డొంకేశ్వర్, ఫిబ్రవరి 11: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 50వేల మెజారిటీ వచ్చే విధంగా ప్రతీఒక్క బీజేపీ కార్యకర్త పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో యాదవ సంఘంలో బీజేపీ మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ నా గెలుపు బీజేపీ కార్యకర్తల గెలుపు అని బీజేపీలో కార్యకర్తలు డబ్బుకు లొంగని నిబద్ధతో పని చేశారని కొనియాడారు. ప్రతీఒక్క కార్యకర్త నియోజకవర్గంలో ఏళ్ల పాటు జెండా మోస్తూ పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, రాష్ట్ర ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, ఎంపీటీసీలు సంజీవ్, సుగుణ, చిన్నారెడ్డి, గంగాదేవి, మహేష్, బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో మార్కండేయ కండువాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

భక్త మార్కండేయ కండువాల పంపిణీ

ముప్కాల్, ఫిబ్రవరి 11: బాల్కొండ భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని బాల్కొండ మండల కేంద్రంలోని మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భక్త మార్కండేయ కండువాను గ్రామ పద్మశాలీ సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాల్కొండ మండల పద్మశాలి అధ్యక్షుడు మానేటి నాగభూషణం మాట్లాడుతూ పద్మశాలి సంఘం సభ్యులు అందరు సంఘటితం ఏర్పడి రాజకీయంగా సామాజికంగా ప్రతి సభ్యుడు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మార్కండేయ జయంతి సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలో శ్రీమార్కండేయ మందిరంలో పూజ కార్యక్రమాలు ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మానేటి నాగభూషణం, కార్యదర్శి రాజుల రామానాథం, బాల్కొండ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఏలిగేటి మధుకర్, కోశాధికారి రాజేందర్, సంయుక్త కార్యదర్శి తమ్మే కపిల్, సంఘ సభ్యులు నవీన్, సుమన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా
పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి 11: కన్నుల పండుగగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన గావించారు. మున్నూరుకాపు సంఘాలైన గంగరపు సంఘం, పురస్తు సంఘం, తోట సంఘం ఆధ్వర్యంలో భీమ్‌గల్ శివారులో నెలకొని ఉన్న పోచమ్మతల్లి గుడిలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఉదయం 9గంటల నుంచి పట్టణంలోని సార్గమ్మ, పెద్ద పోచమ్మ తల్లులకు నైవేద్యాలు సమర్పించారు. మహిళలు మంగళహారతులతో ముందుకు సాగారు. కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు.

రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత

ముప్కాల్, ఫిబ్రవరి 11: బాల్కొండ మండల కేంద్రంలోని వేవ్ యాడ్ వద్ద సీసీరోడ్డు నిర్మాణం కోసం జిల్లా కోఆప్షన్‌సభ్యుడు మోహీజ్ తన జడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షల ప్రొసిడింగ్ కాపీ ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాహబ్, మైనారిటీ నాయకులు ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట్‌లో మెగా వైద్యశిబిరం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని నారాయణపేట్ గ్రామంలో ఆర్మూర్ సిరి నర్సింగ్‌హోం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నారాయణపేట్, లక్ష్మాపూర్ గ్రామాల ప్రజలకు డాక్టర్ లింగారెడ్డి ఉచిత వైద్యపరీక్షలు చేశారు. ఈ రెండు గ్రామాల ప్రజలు సుమారు 600మంది ఈ శిబిరానికి రాగా డాక్టర్ లింగారెడ్డి, ఇతర వైద్యాధికారులు పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో షుగర్, బీపీ, ఈజీసీ, డీఎండీ, మోకాళ్ల నొప్పులు, ఇతర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరి ఆసుపత్రి డాక్టర్ లింగారెడ్డితో పాటు ముత్యంరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సిరికొండ ఫిబ్రవరి 11: వ్యవసాయ పంపుసెట్టు రన్ కావడం లేదని తెలిసిన మరుక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌పై గల ఎస్‌జీపీఎస్ వైరు వేద్దామని వెళ్లిన రైతుకు కరెంటు షాకు తగిలి అక్కడికక్కడే మరణించిన సంఘటన సిరికొండలో ఆదివారం ఉదయం జరిగింది. గ్రామస్థులు, ఎస్సై రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రానికి చెందిన కంచెట్టి బాబురావు(48) అనే రైతు ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వ్యవసాయ పంపుసెట్టును పరిశీలించగా మోటరు నడువడం లేదని గ్రహించారు. వెనువెంటనే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు పరిశీలించగా ఎస్‌జీపీస్ వైరుపోయిందని గ్రహించాడు.ఏబీ స్విచ్ ఆఫ్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ గద్దెపైకి ఎక్కి ఎస్‌జీపీస్ వైరు వేస్తుండగా కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. భార్య కంచెట్టి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రమేష్ కేసు నమోదు చేసుకుని శవ పంచనామా చేశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు బాబురావుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, తల్లి, చెల్లి, అన్నా ఉన్నారు. బాబురావుకు దీనికి సంబంధంచి వివరాలు అడిగితే ఏబీ స్విచ్ ఆఫ్ చేసినప్పుడు రెండు లైన్లకు సంబంధించి ఆఫ్ కాగా, మూడోది ఆన్‌లో ఉండవచ్చని అంటున్నారు. మూడోది విడిపోకుండా వైరుతో కట్టివేసి ఉండవచ్చని తెలిపారు. ఏబీస్విచ్ ఆఫ్ చేయగానే మూడు లైన్లకు సంబంధించిన లైన్స్ విడిపోవాలని, బాబురావుకు విద్యుత్ షాక్ రావడానికి మూడోది విడిపోకపోవడమే కారణమని వివరించారు. విద్యుదాఘాతంతో రైతు మృతి చెందడం అందరిని కలిచి వేసింది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో సిబ్బంది ఏబీ స్విచ్‌ను పరిశీలించి సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా సత్యసాయి సేవా సదన్ వార్షికోత్సవం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 11: బోధన్ పట్టణంలోని సత్యసాయి సేవా సదన్ 32వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వ హించారు. ఇందులో భాగంగా సదన్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమం, నగర సంకీర్తన, మధ్యాహ్నం సంగీత విభావరి కార్యక్ర మాలు జరిపించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహిం చిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం మహా హారతి,అన్నప్రసాదం వితరణ చేసి కార్యక్రమాలు ముగించారు. ఈకార్యక్రమాల్లో సత్యసాయి సేవాసదన్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జిల్లా కన్వీనర్‌శ్రీనివాస్,మహిళా కన్వీనర్ నాగమణి, గ్రామసేవా ఇన్‌చార్జి ప్రవీణ్, ప్రతినిధులు లక్ష్మీకాంత్‌రెడ్డి, బండారుముత్తెన్న, సూర్య కుమారితో పాటు సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం


మెండోరలో స్వామివారి ఉత్సవాల్లో గోవిందస్వాములు

మెండోర, ఫిబ్రవరి11 మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి పదోవార్షికోత్సవ ఉత్సవాలు ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోవిందాస్వాములు వేకువజామున స్వామివారి మేలుకోలుపులో పాల్గొని గోవింద నామాలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మూడు రోజులుగా జరిగే ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు వేంకటేశ్వరస్వామి వారి గోవింద నామాలు ప్రతిష్ఠాపన ఉంటోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్మూర్‌లో ఇసుక లారీ సీజ్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి11: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 63వ జాతీయరహదారిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని జిల్లా మైనింగ్ అధికారి టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వర్ పట్టుకొని సీజ్ చేశారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన లారీని ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో పార్క్ చేయించినట్లు తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులను పోలీసులకు అప్పగింత

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి11:పట్టణంలోని శాస్త్రీనగర్‌లో అనుమానా స్పందంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను కాలనీవాసులు పోలీసులకు అప్ప గించారు. కాలనీలో ముగ్గురు పిల్లలు ఆడుకుంటున్న సమయంలో బాన్సువాడకు చెందిన శివకృష్ణ, పోతంగల్‌కు చెందిన రమేష్‌లు తాగిన మైకంలో పిల్లల వద్దకు వెళ్ళడంతో వారి కేకలు వేయగా కాలనీవాసులు కిడ్నాపర్‌లుగా భావించి ఇద్దరిని వివరాలు అడగగా సరియైన సమాధానం రాకపోవడంతో దేహశుద్ధి చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో శ్రీధర్‌రెడ్డి మాట్లాడు తూ ఎవరిపైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ఏర్గట్ల, ఫిబ్రవరి 11: మండలంలో పలు బాధిత కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. బట్టాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు మూడ్ గంగారాం, మాజీ సర్పంచ్ గుల్లె లావణ్య భర్త గుల్లె గంగాధర్ కుటుంబ సభ్యులతో పాటు సోమ లింగారెడ్డి, నేరెళ్ల లింగారెడ్డి కుటుంబ సభ్యులను వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీగుల్లెరాజేశ్వర్, బీఆర్‌ఎస్‌మండలాధ్యక్షుడు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం

ఇందల్‌వాయి, ఫిబ్రవరి 11:మండంలోని చాంద్రాయన్‌పల్లి గ్రామంలో ఆదివారం ముది రాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా పెద్దమ్మ ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం బోనాలు ఊరెగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో ముది రాజ్ గ్రామ పెద్దలు నరేష్, రఘు, పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవీపేట,ఫిబ్రవరి11: నవీపేట మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులు

● 11సార్లు వంద శాతం లక్ష్యంతో ముందుకు సాగి ● ఉపాధ్యాయుల పకడ్బందీగా ప్రణాళిక


డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

డొంకేశ్వర్, ఫిబ్రవరి11: విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదోతరగతిలోనే ప్రారంభమవుతోంది. విద్యార్థులు మొదటిసారి రాసే పబ్లిక్ పరీక్షల్లో సాధించే ఉత్తమ గ్రేడ్‌లో భవిష్యత్‌కు పునాది.ప్రణాళిక అమలులో భాగంగా పాఠ్యాంశాలు పూర్తి చేశారు. మంచి ఫలితాలు సాధించే లక్ష్యంగా ఉపాధ్యాయులు రోజు ఉదయం, సాయంత్రం వేళలో తరగతులు నిర్వహిస్తున్నారు.మెరుగైన ఫలితాలు రాబట్టాలనే తపనతో విద్యార్థులు పుస్తకాలతో పోటీపడుతు న్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఏడాది 82మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. గత డిసెంబరులో పాఠాలుపూర్తి చేసిన ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30నుంచి 9.30, సాయంత్రం 4.45 నుంచి 5.45వరకు ప్రత్యేక తరగతులు నిర్వ హిస్తు న్నారు.ప్రతీరోజు ఒకసబ్జెక్టుపై పరీక్ష ఏర్పా టు చేస్తున్నారు.విద్యార్థులను వారి ప్రతిభ ఆధారంగా విభజించి వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

● పదేళ్లుగా వంద శాతం ఉత్తీర్ణత

డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రతీఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. 2023 సంవత్సరం వరకు వంద శాతం ఉత్తీర్ణత సాధించింది.ఈఏడాది కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు,ప్రధానోపా ధ్యాయులు ప్రత్యేకంగా కష్టపడుతున్నారు.ఈ సారి ఎలాగైనా మంచి గ్రేడ్‌సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు పుస్తకాలతో పోటీపడుతు న్నారు.

● సబ్జెక్టుల వారీగా అవగాహన

తెలుగుబాషపై పద్యాలు, సాహిత్యపఠనం ద్వారా పాఠాలను బోధిస్తున్నారు. హిందీబాషపైఅక్షర దోషాలు లేకుండా రాయడం వ్యాకరణపై పట్టు కలిగించేలా నేర్పిస్తున్నారు. ఇంగ్లీష్ బాషపై ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులను నిర్వహిస్తున్నారు. వచ్చే సంవత్సరం నుంచి ప్రతీ క్లాసుకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతిని నిర్వహిస్తున్నారు. గణితశాస్త్రం పైమేళకువలపై తరగతులకు అవసరమయ్యే సుత్రాలను హెచ్‌ఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులకు నేర్పిసు న్నారు. సామాన్యశాస్త్రంపై ప్రయోగాత్మకంగా బోధనసైన్స్ సెమినార్ ద్వారా బోధిస్తున్నారు. సాంఘికశాస్త్రంపై రాజ్యాంగం పట్ల అవగాహన ఓటు యొక్క విలువ విద్యార్థులకు తెలిసి విధంగా మాక్ పోలింగ్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతూ చారి త్రాత్మక ప్రదేశాలకు అజంతా ఎల్లోరా వంటి ప్రదేశాలకు విద్యార్థులతో సందర్శించారు.

ప్రతీ ఏటా బాసర త్రిబుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

గత పది సంవత్సరాలుగా బాసర ట్రిబుల్ ఐటికి ఐదు నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపిక అవుతున్నారు. గత సంవత్సరం ఆరుగురు విద్యార్థులు ట్రిబుల్‌ఐటికి ఎంపికయ్యారు. హైబ్రిడ్ స్టవ్ సైన్స్ ఎక్స్‌పర్‌మెంట్‌లో రాష్ట్రస్థా యిలో జరిగిన పోటీలో మొదటి స్థానంలో సా ధించి జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక య్యారు.

ఉత్తమఫలితాల సాధనకు కృషి

విద్యార్థులు పదవ తరగతి ఎంతో కీలకం ఇక్కడ నుంచి గ్రేడ్ సాధిస్తే భవిష్యత్‌కు బంగారు బాటలు పడతాయి. అందుకు పక్కా ప్రణాళిక రచించుకొని ముందుకు సాగుతున్నాం. ఈ ఏడాది వంద శాతం ఫలితాలు రావడం కోసం విద్యార్థులు సన్నద్ధం చేస్తున్నాం. సంబంధిత ఉపాధ్యా యుల ద్వారా విద్యార్థులకు వారి సందేహా లను నివృత్తి చేసుకుంటున్నారు. ఉత్తమ గ్రేడ్ సాధించేలా విద్యార్థులను ప్రోత్సహి స్తున్నాం. ప్రత్యేక తరగతులపై మరింత శ్రద్ధ వహిస్తున్నాం.

- సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలను మరువొద్దు

● పాఠశాలల అభ్యున్నతికి చేయూతనందించాలి ●కోటగిరిలో 1974-2000 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నాటి విద్యార్థులు

కోటగిరి,ఫిబ్రవరి11: పుట్టిన ఊరు, భవిష్యత్తుకు బాటలు వేసిన పాఠశాలను మరిచిపోవద్దని, భావి తరాలకు ఆదర్శంగా నిలిచేందుకు ప్రతి ఒక్కరు పాఠశాలకు, గ్రామానికి తమవంతు చేయూతనందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1974-2000 సంవత్సరం వరకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం-2 స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటగిరి ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుమారు 400మందికి పైగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. తమకు విద్య నేర్పిన గురువులను అప్యాయంగా పలకరించి వారికి ఘన సన్మానం చేశారు. 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు తమతమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుంటూ యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కిడ్స్ ఆధ్వర్యంలో పాఠశాలలో చదివిన ప్రతి పూర్వ విద్యార్థికి ఘన సన్మానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఎన్నో రంగాలలో స్థిరపడి తాము చదివిన పాఠశాలకు ఒక్క పిలుపుతో చేయూతనందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని పేర్కొన్నారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలలో తలపెట్టిన కార్యక్రమం వివిధ రాష్ట్రాలలో, వివిధ రంగాలలో స్థిరపడిన విద్యార్థులందరు ఒకే చోటుకు చేరుకోవడం గ్రామంలో పండుగ వాతావరణాన్ని కల్పించింది. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ప్రసాద్ రావు, శ్రీరాములు, రవి కిరణ్, ప్రభాకర్ రావు, కిడ్స్ అధ్యక్షులు వీరేశం, గంగాధర్ గౌడ్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, ప్రముఖ వ్యాపారవేత్త రాజశేఖర్, కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్‌కుమార్ చౌదరి, రిటైర్డ్ ఎమ్మార్వోసాయిలు తదితరులు పాల్గొన్నారు.

నాగాపూర్‌లో గ్రామ దేవతలకు బోనాలు


పోచమ్మకు చలిబోనాలు సమర్పించుకుంటున్న మహిళలు

కమ్మర్‌పల్లి ఫిబ్రవరి 11: మండలంలోని కమ్మర్‌పల్లి నాగాపూర్ గ్రా మాలతో పాటు మండలం లోని పలు గ్రామాలలో ఆదివారం ఆయా గ్రా మాల మహిళ భక్త జనం పోచమ్మ ఆలయాలకు పోటెత్తారు. గ్రామాలలోని పోచమ్మ ఆలయాలవద్ద బారులతీరి చలిబోనాలు సమర్పించుకున్నారు.అమ్మవారికి బోనాలు సమర్పించుకోవడానికి మహిళలు ఆదివారం వేకువ జాము 4గంటల నుండే పోచమ్మ తదితర గ్రామరక్షక దేవతల ఆలయాలముందు బారులుతీరి చలిబోనాలు సమర్పించుకున్నారు. పుష్య మాసం అమావాస్య త దుపరివచ్చే ఆది వారం గ్రామరక్షకదేవతలకు బో నాలు సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమని గ్రా మస్థులు, మహిళలన్నారు. మండలంలోని ఆయాగ్రామాల మహిళలు గ్రామ రక్షణార్థం ప్రతిష్ఠించుకున్న గ్రామదేవతలకు అత్యంత భక్తి శ్రద్ధలతో చలిబోనాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహిళలు పెద్ద సంఖ్యలో గ్రామ శివారుల్లో ఉన్న గ్రామదేవతలు పోచమ్మ,మైశమ్మ,ఐదుజేతులపోచమ్మ, నల్లపోచమ్మ,పెద్దమ్మఆలయాలకు తరలివచ్చి బోనాలు సమర్పించుకున్నారు.ఈసందర్భంగా అందరికి అంతా మంచి జరగాలని అమ్మవారలను కోరుకుంటూ నైవే ద్యాలు సమర్పించుకున్నట్లు మహిళలు తెలిపారు.

అంతుచిక్కని వరి పంట..ఆందోళనలో రైతులు

● పంట ఎదుగుదలకు రైతుల పడరాని పాట్లు ● పంటకు మందుల పిచికారీ చేసినా కోలుకోని పంట


నాటి 40 రోజులైనా కోలుకోని వరి పంట


నారుమడిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణీ భాగ్యలక్ష్మి(ఫైల్)

దోమకొండ, ఫిబ్రవరి 11:ఈ యెడు రైతులు ఎప్పటిలాగే దుక్కులు దున్ని వరి నారు సిద్ధం చేసుకుని పంటలు సాగు చేసేందుకు ఎంతో ఆశతో ముందుకు సాగారు. అయితే వరి నారు అలికిన నాటి నుంచి రైతులు మందుల పిచీకారి చేయుటకే బీజీగా ఉంటున్నారు. డిసెంబరు నెలలో నారు పోసిన రైతులు డిసెంబరు చివరి వారం నుంచే వరి నాటు వేసేందుకు దమ్ము చేసి నాట్లు వేశారు. అయితే వరి నాట్లు వేసి 35 నుంచి 40 రోజులైనప్పటికీ కొన్ని చోట్ల వరి కోలుకొవడం లేదని రైతులు చెపుతున్నారు. నాటు వేసినప్పటి నుంచి మందులు చల్లిన ఫలితం రావడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నాట్లు వేసిన నుంచి చివరి వరకు ఎకరానరూ. 10వేల వరకు ఖర్చులు అయ్యోవని కానీ నాట్లు వేసి 40 రోజులు గడవకముందే మందులు స్ప్రే చేయడం వలన ఎక్కువ పెట్టుబడి పెట్టడం జరిగిందని అయినప్పటికీ వరి పంట పచ్చపడటం లేదని రైతులు తెలుపుతున్నారు. యూరియాతో పాటు తెగుళ్ల మందులు, గంట మందులు, పురుగు మందులు, పొలం పచ్చపడేందుకు ఫౌడర్‌తో పాటు ఇతర మందులు చల్లిన పంటలు ఎదగవలసిన స్థాయికి ఎదగకుండా ఉండటంతో ఏమి చేయాలో రైతులకు అంతు చిక్కడం లేదు. కొంత మంది రైతులు నారు మడ్లు కోలుకోకపోవడంతో దున్నేసి మళ్లీ నాట్లు వేసిన సంఘటనలు మండలంలో చాలానే ఉన్నాయి. వ్యవసాయాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పంటల ఎదుగుదలకు చేపట్టవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

మొగిపురుగు నివారణకు పోటాష్ ఉన్న ఎరువులు పిచికారి చేయాలి



మొగిపురుగు యాసంగి వరి పైరుపై ఎక్కువగా ఆశిస్తుంది. ఆశించడం వలన వరి నారు మడి పూర్తిగా తింటుంది. అందువలన వరి కర్రలు ఎదుగుదల ఉండదు. దాని నివారణకు కార్టప్‌హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఏకారానికి లేదా క్లోరంన్‌టో ఫ్లానిక్ 60 మీల్లిలీటర్లు, అలాగే పొలం ఎదుగుదలకు జింక్ లోపం ఉండంటం వలన దీన్ని నివారణకు జింక్‌అఫ్టిడ్ 39శాతం 200 ఎం. ఎల్ 8 పంపులు చేసి ఎకరానికి మందు పిచీకారి చేయాలి.రోగనిరోదక శక్తికి పోటాష్ ఉన్న ఎరువు 13.0 24, 2 కేజీలు ఎకరానికి పిచీకారి చేయాలి. ఎక్కువ మోతాదులో మొగి పురుగు సోకినపుడు వ్యవసాయాశాఖ అధికారులును సంప్రదించాలి.

- భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణీ

పంట మార్పిడి తప్పనిసరి

పురుగు నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పిలక దశలో ఆశిస్తే మొవ్వులు ఎండి చనిపోతాయి. అంకురం నుంచి చిరు పొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి.వ్యవసాయశాఖ అధికారులు, ఏఈవోలు అందుబాటులో ఉంటారు. తప్పని సరిగా వారి సలహాలతోనే మందులు పిచీకారి చేసి తర్వాత ఆ మడిలోనే ఇంకేటట్లు చేయాలి. పంటల మార్పిడి తప్పని సరి చేయాలి. లేదంటే నేల సోడ్‌గా మారడానికి అవకాశం ఉంటుంది.రైతులు పంటల మార్పిడికి ప్రణాళికలను తయారు చేసుకోవడం వలన అధిక దిగుబడులు పోందవచ్చు.

-ఏవో పవన్ కుమార్, మండల వ్యవసాయాధికారి

బర్దిపూర్‌లో శ్రీహరిహర క్షేత్ర బ్రహ్మోత్సవాలు



బర్దిపూర్‌లో హరిహర క్షేత్రంలో శిఖర పూజలు చేస్తున్న పురోహితులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని బర్దిపూర్‌లో శ్రీహరిహర క్షేత్రంలో ఏకాదశ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6గంటలకు మంగళవాయిద్యం, వేదపారాయణ సుప్రభాతము, గణపతి పూజ, పుణ్యాహవచనము, రక్షాబంధన, అష్టోత్తరకలశ ఆరాధన, శిఖర ఆదివాసనము, ఆధజ్జవాసాంగ హోమము, కుంభాభిషేకము, పూజలు జరిగాయి. ఈ పూజల్లో పాల్గొనేందుకు బర్దిపూర్‌తో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుంచి మహిళ భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పరాంకుశం వెంకట సీతరామాచార్యులు ఆధ్వర్యంలో శివాలయ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠామహోత్సవము నిర్వహించారు. నేడుహరిహర మంగళ వాయిద్యాలతో సుప్రభాత సేవ, ఉదయం 6గంటలకు గణపతి అభిషేకము, 8గంటలకు పున్యాహవాచనము,రక్షామంధనము, సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, సాయంకాల ఆరాధన, నైవేద్య ఘంటనాదము, హారతి మంత్ర పుష్పము నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హైకోర్టు న్యాయాధికారి అలిశెట్టి లక్ష్మీనారాయణను కలిసిన జిల్లా న్యాయవాదులు



హైకోర్టు న్యాయాధికారిని సన్మానించిన జిల్లా న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్, ఫిబ్రవరి 11: హైకోర్టు న్యాయాధికారి అలిశెట్టి లక్ష్మీ నారాయణ జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆయనను ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్ చందక్, జిల్లా న్యాయవాదులు కలిసి సన్మానించారు. అనంతరం ఆయన జిల్లావాసి కావడంతో జిల్లా గురించి పలు అంశాలు అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో ప్రధాన కార్య దర్శి బాగిచరణ్, రాజ్‌కుమార్ సుబేదార్, బిట్లరవి, ఉదయ్ కృష్ణ, రాజు, జగన్మోహన్‌గౌడ్,న్యాయసేవాసంస్థ సిబ్బంది పురుషోత్తంగౌడ్ పాల్గొన్నారు.

దేవతమూర్తులకు గంగాజలాలతో అభిషేకం



ఆలూర్‌లో గంగాజలాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న గ్రామస్థులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి11: ఆలూర్ మండల కేంద్రంలో వీడీసీఆధ్వ ర్యంలో ఆదివారం దేవత మూర్తులకు గంగాజలంతో అభిషేకం నిర్వహిం చారు. దేగాం శివారులోని గోదావరి తీరం నుంచి గంగజలాలను తీసుకు వచ్చి గ్రామంలో డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అన్ని ఆలయాల్లో దేవతమూర్తుల విగ్రహాలకు గంగజాలలతో అభిషేకం చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సురక్షితంగా ఉండాలని ఆకాంక్షిస్తూ దేవత మూర్తులకు జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్‌రెడ్డి, మధు,రాకేష్, అనిల్, శీను, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అదే విధంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటా ర్యార్‌లో వీడీసీ ఆధ్వర్యంలోదేవతమూర్తులకు జలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఇట్టెడి గంగారెడ్డి, తిరుపతిగౌడ్, లింబాద్రి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన హైలెవెల్ వంతెన నిర్మాణ పనులు



కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు

ధర్పల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని మద్దూల్‌తండా-వాడి గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. జనవరి19న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణానికి గాను రూ.9కోట్ల 50లక్షలు మంజూరు అయ్యాయి. ఇక్కడ గల పాత బ్రిడ్జి శిథిలావస్థలో చేరడంతో పాటు వర్షాకాలంలో బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్థంభించేవి.వాడి- హోన్నాజీపేట్ గ్రామాలకు మండల కేంద్రంతో దారులు మూసుకపోయేవి. దీంతో అయా గ్రామాల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతీ వర్షాకాలంలో ఇదోతంతు కావడంతో మండల ప్రజలు విసిగిపోయారు.ఈవిషయమై గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభం కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు బ్రిడ్జి నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగవుతున్నాయన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డికి ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు అభినందనలు తెలిపారు.

నేటి జగదాంబాదేవి ఆలయంలో జాతర ఉత్సవాలు ప్రారంభం



బషీరాబాద్‌లో ముస్తాబైన జగదాంబాదేవీ ఆలయం

కమ్మర్‌పల్లి,ఫిబ్రవరి 11: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామ శివారులో కొలువుదీరిన మాతా జగదాంబా(శుక్రవారం దేవి) ఆలయంలో జాతర ఉత్సవాలు ఆదివారం 11 నుంచి ప్రారంభమయ్యాయని అలయ అర్చకులు మంత్రరాజ్యం మురళి, కృష్ణ పంతులు, తెలిపారు. ప్రతీ సంవత్సరం వసంతపంచమిని పురస్కరించుకొని గ్రామ ఎన్నారై పోలీస్ విద్యాసాగర్ లావణ్య దంపతులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఆలయవార్షికోత్సవాలు, జాతరా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ. ఈసందర్భంగా దేవిదీక్ష మాలధారణ కార్యక్రమంతో ఉత్స వాలు ప్రారంభమయ్యాయని అర్చకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం గ్రామం నుంచి ఆలయం వరకు అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపు, 14న బుధవారం వసంతపంచమి, అమ్మవారి జాతర ఉత్సవం, కుంకు మార్చన, మహా బలి,అన్నదానసత్రం, రథోత్సవం 15న గురువారం వసం తోత్సవం, పుష్కరస్నానం, సాయంత్రం పల్లకీసేవ నిర్వహన జరుగు తోందన్నారు. జాతర సందర్భంగా అన్ని ఏర్పాట్లు జరిగాయని భక్తులు ఈఉత్సవాలకు పెద్ద సంఖ్యహాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వహకులు, పోలీస్ విద్యాసాగర్ దంపతులు, గ్రామ మాజీ సర్పంచ్ సక్కరం అశోక్, ఎంపీటీసీ తోట జ్యోతి, గ్రామ కమిటీ సభ్యులు, దేవిదీక్షాపరులు కోరారు. కాగా జగదాంబాదేవి ఆలయ వార్షికోత్సవం, జాతర సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు, మహిళలు సైతం దేవిదీక్షలు చేపట్టారు వీరికి ఆలయ అర్చకులు మాలధారణ చేయించారు.

మైలారంలో పేలిన గ్యాస్ సిలిండర్

- వృద్ధా దంపతులకు తీవ్రగాయాలు

ధర్పల్లి, ఫిబ్రవరి11: మండలంలోని మైలారం గ్రామంలో ఆది వారం ఉదయం ఎల్‌పీజీ వంట గ్యాస్ లీక్ అయ్యి ఇళ్లు పేలి పోగా ఇంట్లో ఉన్న వృద్ధా దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించి ఎఎస్సై దుర్గాప్రసాద్ వివరాలను అందిం చారు. గ్రామానికి చెందిన రాజన్న, గంగు గ్రామంలో గల ఇంటిలో నివాసముంటు న్నారు. శనవారం ఇంట్లో గల సిలిండర్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌ను బిగిం చారు. కాగా ఆదివారం ఉదయం బీడీ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు వ్యా పించాయి. మంటల దాటికి ఇళ్లు కూలిపోవడంతో పాటు దంపతులకు తీవ్రగాయాల య్యాయి. వాటిని వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించారు. రాజన్నకు తీవ్రగాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఇంట్లో ఎల్‌పీజీ గ్యాస్ లీక్ అయి ఈ సంఘటన చోటు చేసుకున్నట్టు ఎఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



కనక్యాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 11: కన్యకాపరమేశ్వరి దేవి ప్రజలం దరినీ ఆయురారోగ్యాలతో ఉండే చూడాలని, బోధన్ పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆదివారం బోధన్ పట్టణంలోని పోస్టాఫీసు వద్ద గల కనక్యాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య ఇలవేల్పు అయిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పాణ దినోత్సవాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కుంకుమ పూజలు, అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉం డాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల య కమిటీ అధ్యక్షుడు గంజి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కంటాల రమేష్, కోశాధికారి పబ్బ మురళి, అనిల్, కొత్త రాజేశ్వర్, మాశెట్టి రమేష్, పార్శ శ్రీధర్‌లతో మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఖిల్లా డిచ్‌పల్లిలో అనుమానాస్పద వ్యక్తిని చితకబాదిన గ్రామస్థులు



డిచ్‌పల్లిలో అనుమానస్పద వ్యక్తిని చితకబాదిన గ్రామస్థులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 11: ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో సంచరిస్తున్న అనుమానా స్పద వ్యక్తిని గ్రామస్థులు ఆదివారం పటుకొని చితకబాదారు. చిన్నపిల్లల కిడ్నాపర్లు గ్రామాల్లో సంచరిస్తున్నరని వార్తలతో గ్రామస్థులు అనుమానాస్పద వ్యకిని పట్టుకొని వివరాలు అడగ్గా ఏలాంటి సమాచారం చెప్పకపోవడంతో గ్రామస్థులు చితక బాదారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని ఠాణాకు తీసుకెళ్లారు.

సుర్బిర్యాల్‌లో జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి11: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో అంబేద్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అబ్బ రాజేశ్వర్ స్మారక టోర్నమెంట్‌ను రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి, ఉపిరెడ్డి, డాక్టర్ రాజేశ్వర్ కబడ్డీ సంఘం జిల్లా కార్యదర్శి మోహన్‌దాస్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుర్బిర్యాల్ గ్రామానికి క్రీడల పరంగా అన్ని రకాల ప్రోత్సహం అందించడానికి రాష్ట్ర కబడ్డీ అసో సియేషన్ ముందుంటుందన్నారు. టోర్నమెంట్‌ను అబ్బదిలీప్ తన సొంత ఖర్చులతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాకేష్, కబడ్డీ అసోసియేషన్ కోశాధి కారి సంకేపల్లి గంగాధర్, మునిరాజ్, గడిడ చిన్నయ్య, జె.రాజేశ్వర్, ప్రమోద్, వినోద్, శివ, మధు, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి సుమీర్‌అహ్మద్



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సుమీర్‌అహ్మద్

నిజామాబాద్‌అర్బన్,ఫిబ్రవరి 11: కాంగ్రెస్ పార్టీ మాజీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుమీర్ అ హ్మద్ తిరిగి సొంతగూటికి చేరు కున్నా రు.ఆదివారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కి ంగ్ ప్రసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ సమక్షంలో సుమీర్ కాం గ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయనకు మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ కం డువా వేసిపార్టీలోకి ఆహ్వానించారు. సుమీర్ మైనార్టీల సమస్యలపై అనునిత్యం పోరాడే వ్యక్తి అని అతని రాకవల్ల పార్టీ బలోపేతం అవుతోందని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. అనం తరం రాష్ట్రప్రభుత్వ సలహాదారుడు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీని సుమీర్‌అహ్మద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందచేశారు. ఈకార్యక్ర మంలో నజీబ్‌అలీ, రత్నాకర్, పప్పాఖాన్, ఉబేద్ బిన్‌హందాన్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,300	రూ.59,500	రూ.750


సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : లాల్‌సలామ్ (12.00,3.15,6.30,9.45)
స్క్రీన్-2 : ఈగల్ (12.20,7.00)
: హనుమాన్ (3.40)
:ట్రూలవర్ (10.20)
స్క్రీన్-3 : తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (10.15)
: యాత్ర-2 (1.25,7.15,10.20)
:ట్రూలవర్ (4.20)
స్క్రీన్-4 :కెమరామెన్ గంగాతో రాంబాబు (12.25)
:తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (3.40,6.50,10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఈగల్ (10.30,1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : యాత్ర-2 (1.30,,10.35)
:అంబాజీపేటమ్యారేజీబ్యాండ్ (4.35)
: లాల్‌సలామ్ (7.35)
స్క్రీన్-3 :ట్రూలవర్ (10.40,1.35,4.25,10.30)
:హనుమాన్ (7.25)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఈగల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : లాల్‌సలామ్ (11.15, 6.15,)
:యాత్ర-2 (2.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్